కొత్త మామిళ్లు పూచెను..

కొత్త మామిళ్లు పూచెను గుత్తులుగను
వేప పూతలు కొమ్మల్లో విరగకాసే..
కుహుకుహూయను
రాగాల కోకిలమ్మ కూసె
మధురంగ పచ్చనౌ కొమ్మలపయి
తెలుగు నాట యుగాది ఓ తీపిగుర్తు
యిలను తీపి, చేదుల యొక్క కలయికైన
పచ్చడుల నారగించెడి ముచ్చటైన
సంబరాల యుగాదికి స్వాగతమ్ము



- వడ్ల వీరాచారి,
రిటైర్డ్ ఏఈ,
వనపర్తి

శతకోటి ఆశలతో..

వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాం
కోటి ఆకాంక్షలను నివేదిస్తున్నాం
ప్రకృతిని పరవశింపజేసి
వసంతాన్ని విరబూసినట్లు
కోయిల సుమధుర గీతంలా
మా జీవితాల్లో మాధుర్యం నింపుతావని
యుగ యుగాల నుంచి
తెలుగు వారి ముగిళ్లకు
ఉగాదిగా విచ్చేస్తున్న నూత్నవత్సరమా!
నీకు స్వాగతం
షడ్రుచుల మా జీవితం ఈ ఏడాదంతా
నిత్య శోభితంగా చేస్తావని
శతకోటి ఆశలతో నిన్ను ఆహ్వానిస్తున్నాం.



డా.బి.శ్యాంసుందర్,
తెలుగు పండిత్,
ఉన్నత పాఠశాల,
కేతేపల్లి

విశ్వావసు ఉషస్సులు..

తరువులు వడలు విప్పుకుని శిశిరం
చిగురించింది..
నవవసంతమై పరవశించి, అలలగీతం
సరాగాలై ఆలపిస్తుంది..
ఆదియుగాది-షడ్రుచుల ఉగాది..
ప్రకృతి సిరులతో పొంగిపొర్లి పరిమళించే
పున్నమిలా,
ఋతురాగాల సంగమంతో విచ్చేయుచున్న
విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం.!
ఆమని పిలుపులు..
స్వాగతించే మామిడి తోరణాలు,
వేపపూత లోగిళ్లు..
షడ్రుచుల్ని పంచే మమతల కోవెలలు,
నెమళ్ల నాట్యాలు.. పల్లెపదుచుల అందాలు,
మన తెలుగు లోగిల్లో వికసిల్లాల్సిన సంబ
రానికి సుస్వాగతం..!!
ఓ విశ్వావసు నామ సంవత్సరమా..
చెదిరిపోయిన కాలం
కొత్త ఉషస్సులీ ప్రసరించలే.
విరబూయాల్సిన బంగారు తెలంగాణ
మాగాణం పరిథవిల్లలే..
ఎండిన కొమ్మలు.. వాడిన మొగ్గలు,
చిగురించింది బతుకులు..
అంతా ఎండమావిళ్లే.
నిప్పులవానాలా ఉప్పెనవుతావో,
మేఘమై గాండ్రిస్తావో.. మెరుస్తావో.. వర్షమై
వర్షిస్తావో.. మానవీయపరిమళమై
మురిపిస్తావో..?



- డి.కృష్ణయ్య
(హిమబిందు),
వీపనగండ్ల

క్లుప్తంగా

సర్టిఫికెట్ల జారీలో జాప్యం



వనపర్తి రూరల్: యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీరామ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యువత స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం యువ వికాస పథకం ప్రవేశ పెట్టడం హర్షణీయమన్నారు. అయితే పథకానికి ధ్రువ పత్రాలు ఆదాయం, కులం, రేషన్‌కార్డు జత చేయాల్సిన అవసరం ఉందన్నారు. చాలా మందికి రేషన్‌కార్డులు లేకపోవడంతో ఆదాయం, కులం సర్టిఫికెట్‌కు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేస్తున్నారు. కార్యాలయంలో సాంకేతిక కారణాల వలన సకాలంలో పత్రాలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా ఆన్‌లైన్ పనిచేయక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో దరఖాస్తు సమయాన్ని ఏప్రిల్ 15 వరకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో కళావతమ్మ, గోపాలకృష్ణ, పృథ్వీనాదం, ఎత్తం మహేష్, వంశీ, ప్రసాద్, చిన్నకురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

- పీఏసీఎస్ అధ్యక్షులు కొట్టం వంశీధర్‌రెడ్డి, వాసుదేవారెడ్డి
- సింగిల్ విండోల ద్వారా రుణాల అందజేత



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ కొట్టం వంశీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న పామాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు వాసుదేవారెడ్డి

కొత్తకోట రూరల్: రైతుల సంక్షేమానికి కొత్తకోట సింగిల్ విండో నిరంతరం కృషి చేస్తుందని పీఏసీఎస్ అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ కొట్టం వంశీధర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని విండో కార్యాలయంలో సీఈఓ బాలరాజుచారి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మహాజన సభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సంఘం ద్వారా బంగారు తాకట్టుపై 92 మందికి రూ.కోటి, 241మందికి రూ.1.50 కోట్ల వ్యవసాయ రుణాలు, యువత ఉపాధి, వ్యాపారం కోసం వంద మందికి రూ.కోటి ఇచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ ద్వారా సంఘం పరిధిలోని 552 మంది రైతులకు రూ.3.49కోట్లు రుణమాఫీ వర్తించిందన్నారు. వీటితో పాటు ఇతర వ్యాపారాలకు సంఘంలో రుణాలు ఇస్తున్నామని, సింగిల్‌విండో ద్వారా విద్య, గృహ నిర్మాణం, పాడి పరిశ్రమ వంటి వాటికి దీర్ఘకాలిక రుణాలను అందిస్తున్నామని తెలిపారు. దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న వారు క్రమం తప్పకుండా చెల్లించి, సింగిల్‌విండో అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, డైరెక్టర్లు బాలకృష్ణారెడ్డి, నాగరాజు, సువార్తమ్మ, లక్ష్మి, సురేష్‌కుమార్, రాంలాల్‌నాయక్, మురళి, నాగేంద్రం, రాజు, భాస్కర్, నరసింహులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

500 మెట్రిక్ టన్నుల గోదాం..

రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పనిచేస్తుందని పామాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు వాసుదేవారెడ్డి అన్నారు. సీఈఓ రాఘవేందర్‌రెడ్డి అధ్యక్షతన పీఏసీఎస్ పామాపురం పరిధిలోని అప్పరాలలో మహాజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవారెడ్డి మాట్లాడుతూ అప్పరాలలో గల గోదాం ఆవరణలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, పామాపురంలో పీఏసీఎస్ ఆవరణలో 500 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం చేయాలని తీర్మానం చేయడంతో పాటు వడ్లు ఆరబోసేందుకు ప్యాడి డ్రయ్యర్ కావాలని రైతులు కోరడంతో సభ సానుకూలంగా స్పందిస్తూ తీర్మానం చేసిందన్నారు. పీఏసీఎస్‌లో రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. ప్రతి సీజన్‌కు సంబంధించి ముందుగానే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. వరిధాన్యం విక్రయించుకనేందుకు అవసరం ఉన్నచోట ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు దేశి వెంకటయ్య, పాలక వర్గ సభ్యులు చంద్రాయుడు, గిన్నె శ్రీనివాస్‌రెడ్డి, అయ్యగారి నాగిరెడ్డి, నీలవర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రైతులు లక్ష్మీకాంత్‌రెడ్డి, రవిరెడ్డి, శంకర్, సాయిరెడ్డి, కృష్ణయ్య, మొగులన్న, సిబ్బంది సురేష్, శ్రీను, నిరంజన్ తదితరులు ఉన్నారు.

పాఠశాల ఆవరణలో మురుగు



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ఉన్నత పాఠశాల ఆవరణలోకి మురుగు నీరు రాకుండా నిరోధించాలని కోరుతూ శనివారం విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. పాఠశాల పరిసరాలల్లోని గృహాలకు సంబంధించిన మురుగు అంతా పాఠశాల ఆవరణలోకి వస్తుండటంతో ప్రతి నిత్యం విద్యార్థులు మురుగు నీటిపైనే నడుచుకుంటూ తరగతి గదులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మురుగు నీటితో దోమల వృద్ధితో పాటు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని పంచాయతీ సిబ్బందికి, గ్రామ కార్యదర్శికి విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలోకి మురుగు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని లేనిచో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గ్రామ కార్యదర్శి కుమార్, వెంకటేష్, చరణ్, భాస్కర్, ధరణి, అమృత, సిరిచందన తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఖిల్లాఘనపురంలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద శనివారం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింది అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వనపర్తి రూరల్: మండలంలోని అచ్యుతాపురంలోని గుంటి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అర్చకులు నవీన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అర్చన, నైవేద్యం, మహామంగళహారతి, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో నరేందర్ స్వామి, రమేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

'క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి'



కొత్తకోటలో బ్యాటింగ్ చేస్తూ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎమ్మార్

కొత్తకోట: మండల కేంద్రంలో కేఎంపీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జీఎమ్మార్ గోల్డ్ కప్ క్రికెట్ పోటీలను శనివారం దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా కొన్ని రోజుల క్రితం మృతి చెందిన ఉమ్మడి జిల్లా సీడీసీ చైర్మన్ కే.శే.పాపయ్యగారి చంద్రశేఖర్‌రెడ్డి (గొల్లబాబు) చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడల్లో ప్రతి క్రీడాకారుడు రాణించి రాష్ట్ర, దేశ స్థాయిలో ప్రాతినిధ్యం వహించాలని, దీనివలన భవిష్యత్‌లో క్రీడాకారులకు ప్రభుత్వ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని ఆయన తెలిపారు. క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలని, గెలుపోటములు ఆటలో సహజమని, ఎవరు గెలిచినా హుందాగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, మేస్త్రీ శ్రీను, పాపయ్యగారి కృష్ణారెడ్డి, బోయేజ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, జేసీబీ రాములు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని వినతి

కొత్తకోట మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వేముల హరీష్‌రెడ్డి, కొట్టాల శివకుమార్ రెడ్డి ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో యాసంగి వరి కోతలు మొదలైన సందర్భంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ధాన్యం సేకరణలో పారదర్శకంగా పాటించి రైతులందరికీ మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

క్రీడలతో మానసికోల్లాసం

పాన్‌గల్: క్రీడా పోటీలు మానసికోల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్ అన్నారు. శనివారం మండలంలోని వెంగళాయిపల్లిలో బంగ్లా రాములు జ్ఞాపకార్థం వారి కుమారులు సుజీవన్, మురళి ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా వెంగళాయిపల్లి ప్రీమియర్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పోటీల నిర్వహణతో గ్రామస్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులు తమ ప్రతిభ గుర్తింపునకు మంచి అవకాశం అన్నారు. విజేతలుగా నిలిచిన జట్లకు నిర్వాహకులు నగదు బహుమతులు ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ. 5 వేలు నగదుతో పాటు మెమోంటోలను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో రవికుమార్, వెంకటేష్‌నాయుడు, మధుసూదన్ రెడ్డి, రాముయాదవ్, తిరుపతయ్యసాగర్, పుల్లారావు, జయరాములుసాగర్, నరేందర్‌గౌడు, రాంచందర్, ఆంజనేయులు, కరాటే గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



కొత్తకోట రూరల్: విశ్వావసు నామ సంవత్సర త్రైతశకం 47వ సంవత్సర తెలుగు ఉగాది క్యాలెండర్‌ను పెద్దమందడి తహసీల్దార్ సరస్వతి చేతుల మీదుగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు ఆవిష్కరించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు స్వామివారు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో ఎన్నో భగవద్గీత వచనాలను జోడించి ప్రతి ఒక్కరికీ సరళమైన భాషలో అర్థం అయ్యే విధంగా రూపొందించినట్లు త్రైత సిద్ధాంత సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర ఆచారి, రవి, సుదర్శన్, మనోహర్, ఆంజనేయులు, జాంగీర్, మహేష్ ఉన్నారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

ఖిల్లాఘనపురం: మండలంధిలోని మానాజీపేట ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం 370 వాటర్‌బాటిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జయశంకర్, ఖిల్లాఘనపురం మండల కమిటీ అధ్యక్షుడు విశ్వనాథం, కోశాధికారి రాఘవేందర్, హెచ్ఎం వెంకటేష్, చైర్మన్ పల్లవి, నాగరాజు ఉన్నారు.

గోవర్ధనగిరిలో ఎండుతున్న పంటలు



వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో రైతులు సాగుచేసిన వరి పంటలు నీరు అందక ఎండిపోతున్నాయని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ బావులు, బోర్లు, జూరాల కాల్వకు అనుసరించి ఉన్న పొలాల్లో సాగు వరి పంటలు రోజురోజుకూ పెరుతున్న ఎండలతో చేతికి వచ్చిన పంట ఎండిపోయే స్థితికి చేరుకుంటున్నాయని గుంటి కర్ణాకర్, బాలరాజు, సురేష్, నర్సింహ తదితర రైతులు వాపోయారు. రూ.వేలు పెట్టుబడి పెట్టి చేతికి వచ్చే దశలో పంటలను కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ యువ నాయకుడు బొలామోని దర్గేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఖిల్లాఘనపురం: అధికార భాషగా గోరి బోలి భాషను గుర్తించడంపై హర్షం వ్యక్తం చేసిన గిరిజనులు, కాంగ్రెస్ నాయకులు శనివారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఖిల్లాఘనపురం బస్టాండు వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, గిరిజన నాయకులు రవినాయక్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తెలంగాణ ప్రభుత్వం గోర్ బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోవిందు, ఆగారం ప్రకాష్, క్యామ రాజు, గంజాయి రమేష్, నారాయణ, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు

ఖిల్లాఘనపురం: మండలంలో శనివారం నిర్వహించిన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ జయశంకర్ తెలిపారు. మొత్తం 443 మంది విద్యార్థులకు గాను 441 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన చెప్పారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 228 మంది, ప్రభుత్వ జనియర్ కళాశాలలో 213 మంది విద్యార్థులు పరీక్ష హాజరైనట్లు ఎంఈఓ వెల్లడించారు.

అగ్నివీర్‌కు ఇద్దరు ఎంపిక



కళ్యాణ్‌కార్



చెన్నకేశవులు

గోపాల్‌పేట: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు అగ్నివీర్‌కు ఎంపికయ్యారు. గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన నరేష్, అమృతల కుమారుడు కళ్యాణ్‌కార్ నికేష్, రామకృష్ణ, కుర్వమ్మ దంపతుల కుమారుడు చెన్నకేశవులు అగ్నివీర్‌కు ఎంపికయ్యారు. సుమారు ఆరు నెలల క్రితం నోటి ఫికేషన్ రాగా ముందుగా ఎగ్జామ్, గ్రౌండ్, ఆ తర్వాత మెడికల్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఉద్యోగాలు సాధించిన వీరిని గ్రామస్తులు అభినందించారు.

ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు



ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు శనివారం రాత్రి స్థానిక మస్జిదే నూర్‌లో డాక్టర్ బ్రహ్మారెడ్డి ప్రజావైద్యశాల డాక్టర్ ముజీబ్ ఉర్ రహ్మాన్, డాక్టర్ ముషాహీద్ ఉర్ రహ్మాన్, మస్జిదే సయ్యదియాలో ఇమ్రాన్, ఉమర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానాలు అబ్దుల్‌అలీంరషాది, హఫీజ్ అజ్హర్ ఆధ్వర్యంలో ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో అశ్రఫ్, రజాక్, నవీద్, తౌఫీఖ్, సాబీర్, సలీం, ఖాదర్, తఖీ, అఫ్రోజ్, సుఫీయాన్, జీయా ఉర్ రహ్మాన్, జహంగీర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాములుకు ఘన నివాళి

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం పరమేశ్వరాచారి అధ్యక్షతన రాములు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు, జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఎండీ జబ్బార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, లక్ష్మి, రాజు, బాలస్వామి, మదన్, ఆంజనేయులు, ఉమ, సాయిలీల, బాలరాజు, నందిమల్ల రాములు, రత్నయ్య, కురుమయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

'బాల్యవివాహాలతో ఆరోగ్య సమస్యలు'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

వనపర్తి రూరల్: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి వి రజని సూచన మేరకు మండలంలోని పెద్దగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం బాల్యవివాహాలు, రోడ్డు రవాణా చట్టాలు, పోక్సోయాక్ట్, బాలకార్మికుల చట్టంపై అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రఘు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డుపై నడిచేటప్పుడు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. చిన్న వయస్సులో పెళ్లిలు చేసుకోకుండా, ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపినప్పుడు జరిగిన ప్రమాదంలో ఇతరులు మరణిస్తే యజమానులపై హత్య కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. చిన్నవయస్సులో ప్రేమ పేరుతో విద్యార్థిలను వేధిస్తే పోక్సో చట్టం కింద కేసు నమోదు అవుతాయని దీని ద్వారా చదువుకు దూరమై ఇబ్బందులకు గురవుతారన్నారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం రంగస్వామి, లీగల్ వలంటీర్ రాజేందర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణం కట్టవద్ద పారిశుద్ధ్య పనులు



అమరచింత: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న పంచాంగ శ్రావణ కట్ట ఆవరణంలో శనివారం పారిశుద్ధ్య పనులను మున్సిపల్ సిబ్బంది చేపట్టారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని ప్రతి సంవత్సరం పండుగ రోజు సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం పురోహితుడు పంచాంగ శ్రావణం చేయడం ఆనవాయితీ. ఈ సంవత్సరం సైతం పంచాంగ శ్రావణానికి వస్తున్న ప్రజలకు సౌకర్యాలను కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య పనులు చేపట్టామని మున్సిపల్ కమిషనర్ రవిబాబు తెలిపారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

దామరగిద్ద: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లోకూర్తి గ్రామంలో నిర్వహించిన లోకూర్తి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలని సూచించారు.